తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
05 నవంబర్ 2026
Follow :

ఎల్‌నినో ప్రభావంతో తాగునీటికి ముందస్తు కార్యాచరణ

• డిసెంబర్ తర్వాత సింగూరు నీటి సరఫరా నిలిచే అవకాశం: కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, నవంబర్ 4 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం హవేలీ ఘన్‌పూర్ మండలం సర్దన గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను మిషన్ భగీరథ, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

డిసెంబర్ తర్వాత సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపారు. ప్రత్యామ్నాయ నీటి వనరుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాకు రూ.42 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. సర్దన చెక్ డ్యామ్ వద్ద ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి 3.5 కిలో మీటర్ల మేర జక్కన్నపేట వరకు పైప్‌లైన్ నిర్మించనున్నట్లు వివరించారు. దీని ద్వారా 33 గ్రామాలకు ప్రతిరోజూ ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున తాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. పొడ్చన్‌పల్లి, కొత్తపల్లి, మిన్‌పూర్ చెక్‌డ్యామ్‌ల వద్ద కూడా గ్రిడ్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రజలు నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లాలను నిలిపివేసి నీటి వృథాను అరికట్టాలన్నారు. గ్రామసభల్లో తీర్మానాలు చేసి బోరు మోటార్లను నిర్దిష్ట సమయాల్లో మాత్రమే నడిపేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులకు సూచించారు. నీటి వనరులు, రిజర్వాయర్లలో నిల్వలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్, లోతు పెంపు వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈలు నాగభూషణం, సంపత్ కుమార్, తహసీల్దార్ సింధు రేణుక, సర్పంచ్ వినోద, విద్యుత్ డీఈ రామేశ్వరస్వామి, ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

• అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



జడ్చర్ల, నవంబర్ 4 (జనంసాక్షి): రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి మధుసూదన్ నాయక్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, ఇంజనీర్ గాయత్రితో కలిసి గంగాపూర్, కావేరమ్మపేట ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఈ సందర్భంగా నీటి సంపుల పునరుద్ధరణ, నూతన బోర్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులను తనిఖీ చేసి, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటి సరఫరా జరిగేలా చూడాలని, పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ గిరీష్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే నీటి సమస్యల ఫిర్యాదులకు అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ - 2026


పురోగతిపై అదనపు కలెక్టర్ హరిప్రియ సమీక్ష



జడ్చర్ల, నవంబర్ 4 (జనంసాక్షి): జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఎస్ఐఆర్-2026 పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు మరియు ఎన్నికల సిబ్బంది హాజరయ్యారు. నోటీసుల పంపిణీ, విచారణల పురోగతిపై అదనపు కలెక్టర్ సమీక్షిస్తూ బాలానగర్, రాజాపూర్ మండలాల్లో నోటీసుల పంపిణీ, విచారణలు 100 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన మండలాల్లో పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఏఈఆర్ఓల వద్ద పెండింగ్‌లో ఉన్న ఫారం-6,7,8 దరఖాస్తుల పరిష్కారాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు 45శాతం దరఖాస్తులు పరిష్కారమయ్యాయని, మిగిలినవాటిని కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని తెలిపారు. నోటీసుల జారీ, విచారణల గడువును నవంబర్ 26 వరకు పొడిగించామని, తుది ఓటర్ల జాబితాను నవంబర్ 30న ప్రచురిస్తామని వివరించారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

డిజిటల్ పాలనపై అధికారులకు శిక్షణ

• ఇ-శాంక్షన్, ఇ-హెచ్ఆర్ఎంఎస్, వామిస్ విధానాలపై అవగాహన


మిగతా 10లో..

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 4 (జనంసాక్షి): ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ పాలనను సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా ఇ-శాంక్షన్, ఇ-హెచ్ఆర్ఎంఎస్, వర్క్స్ అకౌంట్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (వామిస్) విధానాలపై అధికారులకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో దశలవారీగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 4న జిల్లా స్థాయి అధికారులకు, 5న మండల స్థాయి అధికారులకు, 6న ఇతర డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులకు శిక్షణ అందించనున్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయలక్ష్మి హాజరయ్యారు. మాస్టర్ శిక్షకులు ఆయా విధానాల పనితీరు, వినియోగం, అమలు తీరుపై అధికారులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఆర్థిక



డబుల్ బెడ్‌రూమ్

ఇండ్ల కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

తూప్రాన్, నవంబర్ 4(జనంసాక్షి): తూప్రాన్ డబల్ బెడ్ రూమ్ కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 450 ఇండ్లలో తనిఖీ చేయక 64 వాహనాలు 38 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్ లో జిల్లా అదరవు ఎస్పీ విక్రాంత్ కుమార్ సీఐ వెంకట్ రాజు గౌడ్ ఎస్సై గంగరాజు డివిజన్లోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి



• పోమాల్, తిమ్మాయపల్లి గ్రామాల్లో కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు

నవాబుపేట, నవంబర్ 04 (జనంసాక్షి):

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బుధవారం నవాబుపేట మండలంలోని పోమాల్, తిమ్మాయపల్లి గ్రామాల్లో ఆమె ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య పనులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. పోమాల్ గ్రామంలో పారిశుధ్య పనుల తీరుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పనులు సక్రమంగా జరగడం లేదని వారు తెలపడంతో వెంటనే చర్యలు తీసుకుని పరిశుభ్రతను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. రెండో తరగతి విద్యార్థినికి బోర్డుపై అక్షరాలు సరిగా కనిపించకపోవడంతో కంటి పరీక్షలు నిర్వహించాలని, అవసరమైతే ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ద్వారా పరీక్షలు చేయించాలని సూచించారు. అన్ని తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.



గ్రామంలో నీటి పైపులైన్ లీకేజీని గుర్తించిన కలెక్టర్, ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున లీకేజీలను వెంటనే అరికట్టి నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసి అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు.

రోగులు, గర్భిణులతో మాట్లాడి మందులు, వైద్య సేవలు, టీకాల వివరాలు తెలుసుకున్నారు. ఐదు గ్రామాల ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.



పోమాల్ గడ్డ కాలనీలో మూడేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి నోచుకోలేదని సర్పంచ్ తెలపడంతో, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగంతో మాట్లాడి భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం తిమ్మాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, చిన్నారుల బరువు, ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. పప్పులు, ఆకుకూరలు, గుడ్ల సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది తెలపడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో సర్పంచ్ కవిత, ఉప సర్పంచ్ అంజనేయులు, పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, జీపీఓ రమేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి సూచికల్లో గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ మెరుగైన పురోగతి సాధించాలి

• కేంద్ర బృందం సభ్యుడు నోడల్ అధికారి లోకేష్

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):
గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్‌లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర బృందం సభ్యుడు, నోడల్ అధికారి లోకేష్ సూచించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధి సూచికలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి బ్లాక్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ...
విద్యారంగంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక బోధనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాలబాలికలు మధ్యలో చదువు మానేయకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గర్భిణులకు ఐసీడీఎస్ ద్వారా పౌష్టికా హారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. బ్యాంకింగ్ సేవలు, స్వయం సహాయక సంఘాలు, శిశు ఆరోగ్యం, గ్రామీణ పారిశుద్ధ్యం, అంగన్‌వాడీ మౌలిక సదుపాయాలు, చిన్నారుల పోషకాహారం, మధుమేహ పరీక్షలు వంటి అభివృద్ధి సూచికల్లో సాధించిన పురోగతిని కొనసాగిస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. గట్టు ప్రాంతంలోని స్థానిక అవసరాలు, వనరులు, సంప్రదాయాలకు అనుగుణంగా వినూత్న ప్రాజెక్టులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్థానిక, సంప్రదాయ ఉత్పత్తులను గుర్తించి 'ఆకాంక్ష' బ్రాండ్ ద్వారా ప్రచారం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నారు. తద్వారా కళాకారులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మైక్రోసేవ్ కన్సల్టింగ్ సంస్థ సహకారంతో ఆర్థిక సమ్మిళితం, ఆరోగ్యం, పోషకాహారం, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ రంగాల్లో మరింత పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు.



ఈ సమావేశంలో ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్ సయ్యద్ ఖాన్, డీఆర్డీవో ముసాయిదాబేగం, పీఆర్ ఈఈ ప్రభాకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద, మిషన్ భగీరథ ఈఈ పరమేశ్వరి, బ్లాక్ అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 4(జనంసాక్షి); జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరు గ్రామంలో పారిశుద్ధ్యంపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి



వెల్దండ, నవంబర్ 04 (జనంసాక్షి): వెల్దండ మండలంలోని చెరుకూరు గ్రామాన్ని చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బందితో తొలగించారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా రోజువారీ శుభ్రం చేస్తున్నామని సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్తులు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా, పంచాయతీ ట్రాక్టర్ కు అందించి సహకరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లాలయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వాలీబాల్ జట్టు



శివ్వంపేట, నవంబర్ 4 (జనంసాక్షి): జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో బుధవారం పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. ఇందులో తూప్రాన్ పిఎం శ్రీ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, చికోడ్ లింగాయ పల్లి పీఎం శ్రీ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, పిఎంశ్రీ ఉన్నత పాఠశాల శివ్వంపేట తృతీయ స్థానం సాధించయని పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. వాలీబాల్ లో గెలుపొందిన జట్లకు బహుమతులు సైతం ప్రధానం చేయడం జరిగిందన్నారు.

తెలకపల్లిని సంపూర్ణ కరువు మండలంగా ప్రకటించాలి

• ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి: అతినారపు వెంకటేష్



తెలకపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి): వర్షాభావంతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు అతినారపు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి రుణాలపై వెసులుబాటు కల్పించాలని కోరారు. రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేస్తే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత



కల్వకుర్తి, నవంబర్ 4 (జనంసాక్షి): లింగసానిపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ సర్పంచ్ పర్షరాములు ద్వారా విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమయ్య, వెంకటేష్, అజయ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌లో ఆశావర్కర్ల నిరవధిక సమ్మె నోటీసు అందజేత



మక్తల్, నవంబర్ 4 (జనంసాక్షి): పెరుగుతున్న ధరలకు తగినట్లు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ ప్రకటించింది. ఇందులో భాగంగా మక్తల్ మండలంలోని కర్ని పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో కలిసి వైద్యాధికారి డాక్టర్ శ్వేతకు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు.
ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవింద్ రాజ్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన ఆశా వర్కర్లను అంతర్జాతీయ సంస్థలు గుర్తించినా, ప్రభుత్వాలు కనీస వేతనం అమలు చేయకపోవడం శోచనీయమన్నారు.
సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ అధ్యక్షురాలు గోవిందమ్మ, ఆశా వర్కర్లు నాగమ్మ, యశోద, అమీనా బేగం, ఇందిరా, సుజాత, లక్ష్మి, పార్వతమ్మ, వెంకటమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి ఎఫెక్ట్... ఫలించిన కథనం..

• కదలిక వచ్చిన ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులు



రేవల్లి, నవంబర్ 04 (జనంసాక్షి): ఒక పత్రిక కథనం ఎంతటి మార్పు తీసుకొస్తుందో నిరూపిస్తూ 'జనం సాక్షి' దినపత్రిక ఎఫెక్ట్ మరోసారి కనిపించింది. "నిధుల కొరతతో అందుబాటులోకి రాని ప్రైమరీ హెల్త్ సెంటర్" అనే శీర్షికతో తేదీ 12-10-2026 నాడు జనం సాక్షి పేపర్‌లో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు ఫలితంగా తేదీ 23-10-2026న 3,10,000/- నిధులు మంజూరు అయ్యాయి. నిధులు మంజూరు కావడంతో మూతపడ్డ ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. నిధుల కొరతతో నిలిచిపోయిన పీహెచ్సీ పనులు, జనంసాక్షిలో వార్త రావడంతోనే పనులు ప్రారంభం కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పందించి, వారి గోడును వెలుగులోకి తెచ్చిన "జనంసాక్షి పత్రికకు" గ్రామస్తులు, ప్రజా సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా పనిచేస్తున్న జనం సాక్షి పత్రికకు ఈ ఘటన మరో నిదర్శనంగా నిలిచింది.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కేకే రెడ్డి పాఠశాల విద్యార్థి అజయ్ ఎంపిక

• జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత



తెలకపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి): మండల కేంద్రంలోని కేకే రెడ్డి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం. అజయ్ కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం కల్వకుర్తిలో నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్‌జూనియర్ బాలుర జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అజయ్ ఉత్తమ ఆటతీరును ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు వికారాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో అజయ్ నాగర్‌కర్నూల్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాలలో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు బాలు, పాషా, కిషోర్, కేశవులు, క్రాంతి తదితరులు అజయ్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

లక్ష్యాల సాధనే ధ్యేయం



గద్వాల, నవంబరు 4(జనంసాక్షి):
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సంధ్యా కిరణ్మయి హెచ్చరించారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లాలో పిహెచ్సి సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను, నిర్దేశిత ప్రమాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా పీహెచ్‌సీల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే వ్యాక్సినేషన్ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకూడదని ఆదేశించారు.
క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల పనితీరును సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించి, వారికి అవసరమైన మందులను సకాలంలో అందించాలన్నారు. నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ, వంద శాతం ప్రగతిని సాధించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

సిర్గాపూర్ మండల

సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.సంజీవ్ రెడ్డి

• **ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ**

సిర్గాపూర్, నవంబర్ 4 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ్ రెడ్డి. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో తాగు నీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి



చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సమావేశంలో మండల సర్పంచులు, మండల ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలి

• **గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా శాఖల కార్యదర్శి నవీన్ మిట్టల్**

సిద్దిపేట, నవంబర్ 04 (జనంసాక్షి): రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, గ్రామీణ పారిశుద్ధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఐఏఎస్ బుధవారం కుకునూరుపల్లి మండలం మంగోలు గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లో ఫిల్టర్ హౌస్, ల్యాబ్, 75 మిలియన్ లీటర్స్ క్లియర్ వాటర్ రిజర్వాయర్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా వివిధ గ్రామాలకు జరుగుతున్న తాగునీటి సరఫరా, నీటి నిల్వ సామర్థ్యం, పంపింగ్ వ్యవస్థ, పైపులైన్ల పనితీరు, గ్రిడ్ నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రిడ్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రతిరోజూ సరిపడా, నాణ్యమైన శుద్ధమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, మిషన్ భగీరథ పథకం నిర్వహణలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు కుకునూర్ పల్లి మండలంలోని తిప్పారం గ్రామంలో మల్లన్న సాగర్ తిప్పారం వాటర్ పంప్ హౌస్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈ ఎన్ సి కృపాకర్ రెడ్డి, సిఈ రామచంద్ర, ఎస్ఈలు వెంకట్ రెడ్డి, రాజయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడు శాఖల్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు శిబిరాలు విజయవంతం

• **పట్టభద్రుల ఓటు హక్కుపై ఉద్యోగుల్లో చైతన్యం..**

• **ఫారం-18 ద్వారా దరఖాస్తుల స్వీకరణ**

వనపర్తి, నవంబర్ 4 (జనంసాక్షి): జిల్లాలోని పోలీస్, వైద్య, విద్యాశాఖ కార్యాలయాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమానికి ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది. అర్హులైన పట్టభద్రులైన ఉద్యోగులు తమ ఓటు హక్కును పొందేలా మూడు శాఖల కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫారం-18 ద్వారా



దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు.

ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు హక్కు ఎంతో కీలకమని, సమాజానికి సేవలందించే పోలీస్, వైద్య, విద్యాశాఖ ఉద్యోగులు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఉద్యోగులు ఉత్సాహంగా ముందుకొచ్చి నమోదు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌తో పాటు అనిల్ సిఎల్, శివ తదితర నాయకులు పాల్గొన్నారు. ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పైతర గ్రామంలో

కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

• **కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి**



కొల్చారం, నవంబర్ 04(జనంసాక్షి): కొల్చారం మండలంలోని పైతర గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్ నీ నో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఏఈ సూచించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి నేలను కాపాడుకోవాలని, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, ఏఈఓ అమృత, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు..

• **ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి**



నార్సింగి, నవంబర్ 4 (జనంసాక్షి): మండలంలోని జప్తి శివునూర్, శంఖాపూర్, శేరిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గ్రేస్ బాయి, ఐకేపీ ఏపీఎం సృజన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులు, ప్రైవేట్ వ్యాపారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. విక్రయించిన ధాన్యం డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. బస్తాకు 41.600 కిలోలకు మించి తూకం వేయరాదని, సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి




న్యాల్‌కల్, నవంబర్ 4 (జనంసాక్షి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం కొనసాగించాలని గంగువార్ సర్పంచ్ సుకుమార్, ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సంసన్‌కు సూచించారు. బుధవారం సంసన్‌ను సర్పంచ్‌తో పాటు పలువురు ఘనంగా సత్కరించారు.

మండలంలోని సమస్యల పరిష్కారంతో పాటు ఎస్సీ (మాదిగ) వర్గాల హక్కుల సాధనకు కృషిచేయాలని ఆకాంక్షించారు. దీనికి స్పందించిన సంసన్ ప్రజా సమస్యల పరిష్కారానికి, మాదిగ హక్కుల సాధనకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెగ్యులర్ జడ్జి రాకతో... మక్తల్ న్యాయవాదుల సంబరాలు

• **జిల్లా న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలిపిన లాయర్లు**

మక్తల్, నవంబర్ 04 (జనంసాక్షి): మక్తల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిగా అవినాష్ ను పూర్తి స్థాయిలో కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడటంతో మక్తల్ లాయర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ మూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్‌ను కలిసి మిఠాయిలు తినిపించారు. మక్తల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిగా అవినాష్‌ను పూర్తి స్థాయిలో కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి బోయ శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి అవినాష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ లను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇకపై మక్తల్‌లో పూర్తిస్థాయిలో వారంలో అన్ని పనిదినాల్లో జడ్జి అందుబాటు



లో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, చెన్నారెడ్డి, మక్తల్ కోర్టు అడ్వకేట్స్ అడ్ హక్ కమిటీ అధ్యక్షుడు తిమ్మన్న అడ్వకేట్, నర్సిములు, రాజశేఖర్, రవికుమార్ గౌడ్, భరత్ కుమార్, మహేష్, మోహన్, పొర్ల ఆనంద్, శివ కుమార్, దేవసూగురు సునీత, సతీశ కుమారి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండాల్సిన అధికారులే వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు

• **వ్యవసాయ, రెవెన్యూ శాఖల్లో అవినీతిపై రైతు సమాఖ్య ఆగ్రహం**

సంగారెడ్డి, నవంబర్ 4 (జనంసాక్షి): రైతులకు అండగా ఉండాల్సిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు వ్యాపారులకు మద్దతుగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ఆరోపించారు. సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు లంచాలకు పాల్పడటం దారుణమన్నారు. మంగళవారం ఏసీబీకి చిక్కిన వ్యవసాయ అధికారిపై ప్రస్తావిస్తూ, ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని సమావేశంలో తీర్మానించారు.



అక్రమ నీటి వ్యాపారాలపై కొరడా



అమీన్పూర్, నవంబర్ 04(జనంసాక్షి): నీటి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ వెంకటేష్ హెచ్చరించారు. బుధవారం అమీన్పూర్ పెద్ద చెరువు పరిధిలో నిర్వహిస్తున్న అక్రమ నీటి వ్యాపారాలపై హైడ్రా, రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో దాడులు చేసి బోర్లను తొలగించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ ఎల్నినో పరిస్థితి తో తీవ్రమైన నీటి సమస్యలు రానున్నాయన్నారు. ఎవరు కూడా అక్రమంగా నీటి వ్యాపారం చేయొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడు అక్రమంగా నీటిని తోడుతున్న బోర్లను, రెండు నీటి సంపులు, రెండు ఆర్వో ప్లాంట్లను సీజ్ చేశామన్నారు. నీటి వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



విద్యాభివృద్ధికి వేక కంపెనీ రూ.20 లక్షల విరాళం..

- జగ్గంపేటలో పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ
- విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కంపెనీ ముందుకు రావడం అభినందనీయం
- ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

చిలప్‌చెడ్, నవంబర్ 4 (జనంసాక్షి): మండలంలోని జగ్గంపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హత్నూర మండలంలోని వేక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజ మాన్యం స్వచ్ఛందంగా రూ. 20 లక్షల నిధులతో పాఠ శాల భవన నిర్మాణానికి ముందుకు రావడం అభి నందనీయమని అన్నారు. కంపెనీ ఏజీఎం ప్రొడక్షన్ రఘు, ఏజీఎం మెయింటెనెన్స్ రాంబాబు, హెచ్‌ఆర్ సత్యం జగ్గంపేట గ్రామ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాభివృద్ధికి సహకారం అందిం చడం సంతోషకరమని పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు పౌరులని గుర్తించి విద్యార్థుల పట్ల చూపిన ప్రేమాభిమానాలు, సామాజిక బాధ్యత ప్రశంస నీయమన్నారు.

పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ ప్రతినిధు లకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవంతి రాందాస్ గౌడ్, వేక కంపెనీ సిబ్బంది ఏజీఎంలు రఘు,



రాంబాబు, హెచ్‌ఆర్ సత్యం,తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, మండల పార్టీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డీఈ, ఏఈ, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



నిజాంపేట్, నవంబర్ 4 (జనంసాక్షి): నిజాంపేట్ మండలం రామ్‌చందర్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలను మండల విద్యాధికారి రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. తరగతి గదు ల్లో విద్యార్థుల చదవడం, రాయడం, వినడం వంటి నైపుణ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నాణ్యమైన విద్య అందిం చాలని సూచించారు. సర్పంచ్ అజయ్ నాయక్ మాట్లాడుతూ ఆటపాటల ద్వారా బోధన అందించి విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంక ర్, ఉపాధ్యాయురాలు సమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

కురుమలు ఐక్యంతోనే ఏదైనా సాధ్యం

- కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య



సిద్దిపేట, నవంబర్ 04 (జనంసాక్షి): రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కురుమ కులస్తులు ఎదగాలంటే ఐక్యంగా ఉంటేనే సాధించగలుగుతామని కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య అన్నారు. పట్టణంలోని పటేల్ గార్డెన్ లో బుధవారం ఏడవసారి అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని అధ్యక్షుడు ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. సంఘం ఐక్యతకు, సంఘం పటిష్ట పడడానికి ఈ కార్యక్రమాన్ని గత ఆరు సంవత్సరాలుగా నిర్వహించామని అన్నారు. ప్రతి రాజకీయ పార్టీ కురుమ కులస్తుల నాయకులకు పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. మనలో అనేకమంది ఉద్యోగస్తులు ఉన్నారని, నిరుపేదలందరికీ సహ కారం చేస్తూ విద్యాపరంగా అభివృద్ధి చిందించడానికి కృషి చేద్దా మని అన్నారు. ప్రతినిధులు మాట్లాడుతూ.. కొమురెల్లి మల్లన్న ఆలయ కమిటీ అధ్యక్షునిగా కురుమలకు అవకాశం ఇవ్వాలని, ప్రభుత్వం గొర్రెలకు ఉచితంగా నటల మందును పంపిణీ చేయాలని, ఇతర కులస్తులకు ఇస్తున్న విధంగా పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభు త్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు కోటగిరి ప్రభాకర్, రాజమల్లయ్య, రవి కాంత్, బెదురు తిరుపతి, అందే అశోక్, కంతుల రమేష్, కుమారస్వామి, గుంటి యాదగిరి,మీస సత్యనారాయణ, అందె నాని బాబు, కందూరి ఐలయ్య, బండారి సతీష్, నంగి కనకయ్య, యాదమల్లు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం బ్రేక్‌ఫాస్ట్



చిన్న శంకరంపేట, నవంబర్ 5(జనంసాక్షి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని బుధవారం చిన్న శంకరంపేట, చందంపేట, గజగట్లపల్లి, పాఠశాలలో గ్రామ సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ ప్రవీణ్ నాగభూషణంలు ప్రారంభించారు. ఉదయం 8:30 గంటలకు విద్యార్థులకు అల్పాహారం అందించడం ద్వారా పిల్లలు ఆకలితో ఇబ్బందులు పడకుండా చదువుపై దృష్టి సారించేందుకు పాఠశాలలో హాజరు శాతం పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కులవివక్షపై దళిత సంఘాల ఆగ్రహం

- నిందితులను అరెస్టు చేసేవరకు ఉద్యమం ఆగదు



మనోహరాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి): తూప్రాన్ మండలం వెంకటాయపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో దళితులపై జరుగుతున్న కులవివక్ష, దాడులపై కేవీపీఎస్, డీబీఎఫ్ ప్రతినిధి బృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్రామాలను సందర్శించి బాధితులతో మాట్లాడి ఘటనల వివరాలు తెలుసుకుంది.

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య మాట్లాడుతూ వెంకటాయపల్లిలో పోచమ్మ గుడికి వెళ్లే దారిని అడ్డుకుని దళితులను అడ్డుకోవడం, కులం పేరుతో దూషించి దాడులకు పాల్పడటం దారుణమన్నారు. కిష్టాపూర్‌లో రెండేళ్లుగా మాదిగలను డప్పులు కొట్టకుండా అడ్డుకుంటూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నవంబర్ 5న కోనాయపల్లి నుంచి తూప్రాన్ డీఎస్పీ కార్యాలయం వరకు మహాపాదయాత్ర నిర్వహించి ముట్టడిస్తామని, స్పందించక పోతే నవంబర్ 11, 12 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 48 గంటల నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు వురు దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూనీడు అభివృద్ధి కోసం ఆరో రోజు నిరసన దీక్ష

- ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి
- పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్



కొత్తపల్లి, నవంబర్ 4 (జనం సాక్షి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ భూనీడు గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గ్రామ ప్రజ లు, యువకులు చేపట్టిన నిరసన దీక్ష ఆరో రోజుకు చేరుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు చేయా లని వారు డిమాండ్ చేశారు. భూనీడు గ్రామంలో పోలీస్ స్టేషన్‌తో పాటు ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. భౌగోళికంగా నంది గామ, తిమ్మారెడ్డిపల్లి, గోకుల్‌నగర్, దుప్పటి గట్టు, గొర్లోనిబావి, గొల్లగడ్డ, వాల్యానాయక్ తండా, కిషన్‌నగర్ తదితర గ్రామాలకు భూనీడు అందుబాటులో ఉంటుందని, ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం పోలీస్ స్టేషన్, ఆసుపత్రిని ఇక్కడే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధి కారంలో ఎవరున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ఉందని, గ్రామ అభివృద్ధి ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని నిరసనకారులు కోరారు.

ఈ నిరసన దీక్షలో బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోధుమ బాలు మాదిగ, వార్డు సభ్యుడు నడ్డి రాజు, భీమ్ రెడ్డి, రమేష్, జయవర్ధన్, వెంకట్, శ్రీను, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

శ్రీ శంభు దేవాలయ పునర్నిర్మాణ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నంగునూరు (జనంసాక్షి): మండలంలోని పాల మాకుల గ్రామ పురాతన శ్రీ శంభు దేవాలయ పునర్నిర్మాణం కోసం సర్పంచ్ పోతరబోయిన ఓజల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షు డిగా ఓజల్, అధ్యక్షుడిగా ఎల్లంకి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వరదోలు వేణు చక్రవర్తి, కోశాధికారిగా ఏల్పుల ఐలయ్య యాదవ్ ఎన్నికయ్యా రు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని త్వరలో పునర్నిర్మించి పూర్వవైభవం తీసుకువస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు, భక్తులు, దాతలు విరాళాలు అందించి సహకరించాలని కోరారు.

ఇండస్ మెడికేర్ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘన విజయం..

- ఇది కార్మిక విజయం సి.ఐ.టీ.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్

తూప్రాన్ నవంబర్ 3(జనంసాక్షి):

రామయిపల్లి శివారులోని ఇండస్ మెడికేర్ పరిశ్రమలో మంగళవారం నాడు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్ని కల్లో ఐఎన్‌టీయూసి, బిఆర్‌టీయూ, కూటమిపై సిఐటీ యూ ఘన విజయం సాధించింది. మొత్తం 68 ఓట్లలో సిఐటీయూకు 38, ఐఎన్‌టియూసికి 25 ఓట్లు వచ్చినాయి. సిఐటీయూకు 13ఓట్ల మెజారిటీ వచ్చిం ది. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మనోహరా బాద్ మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ చేతిలో ఓటమి చెందినారు. టపాసులు పేల్చి కార్మికులు సంబరాలు జరుపు కున్నారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు సి ఐ టీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా సి ఐ టి యుకు ఘన విజయం అందించిన కార్మికులకు ధన్య వాదాలు తెలియజేసారు. మాపై కార్మికులు పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా యాజమాన్యంతో చర్చించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని అన్నా రు. పారిశ్రామిక ప్రాంతంలోనే మెరుగైన వేతన ఒప్పం దం సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు.కార్మిక సంఘాల ఎన్నికల్లో డబ్బు మద్యం పంపిణీ, బెదిరింపు లు సరైన పద్ధతి కాదని మల్లికార్జున్ అన్నారు. ప్రత్యర్థి యూనియన్ ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా లొంగ కుండా నిజాయతీ ఓట్లు వేసిన కార్మికులను అభినం దించారు. కేవలం పరిశ్రమలోని సమస్యలే కాకుండా దేశంలో పాలకుల కారణం. కార్మిక వ్యతిరేక విధానల



పై పోరాటానికి కారణం. కార్మిక వర్గాన్ని సిఐటీయూ సిద్ధం చేస్తుందన్నారు. కార్యదర్శి ఏ.మల్లేశం, ఉపాధ్య క్షులు మహేందర్ రెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలేష్, నాయకులు సుజాత, తిరుపతి, పూర్ణేశ్, ఉపేంద్ర, విక్రమ్ రెడ్డి, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తొలగిన ఇనుప స్తంభాల సమస్య

• మాజీ కౌన్సిలర్ బుక్క మహేష్



జడ్చర్ల, నవంబర్ 4 (జనంసాక్షి):
మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట గ్రామ చవిడి వద్ద ఉన్న ప్రమాదకర ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయడం పట్ల మాజీ కౌన్సిలర్ బుక్క మహేష్, బిజెపి నాయకులు పిట్టల నరేష్, బుక్క నవీన్ పలువురు అఖిలపక్ష నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా అఖిలపక్ష నాయకులతో కలిసి ప్రజావాణిలో జిల్లా అధికారులకు, విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు మహేష్ తెలిపారు. పత్రికల్లో వార్తలు రావడం, వినతిపత్రాలకు స్పందించిన విద్యుత్ అధికారులు బుధవారం సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారని, సమస్య పరిష్కారానికి కృషి చేసిన విద్యుత్ అధికారులకు, వార్తా కథనాలతో సహకరించిన పత్రికా విలేకరులకు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కరువు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

• పంట నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించాలి: పల్లా వెంకటరెడ్డి



తెలకపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి): వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.
సీపీఐ రాష్ట్ర కరువు పరిశీలన బృందం ఆయన నాయకత్వంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి, బల్మూరు, ఉప్పునుంతల, అచ్చంపేట, అమ్రాబాద్, పదర మండలాల్లో పర్యటించి ఎండిపోయిన పంటలను పరిశీలించింది. మొక్కజొన్న, పత్తి, మిర్చి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు గుర్తించింది. రైతులతో మాట్లాడి పెట్టుబడులు, పంటల పరిస్థితిని తెలుసుకుంది. ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలని, బాధిత రైతులకు పరిహారం, రుణ ఉపశమనం కల్పించాలని కోరింది. తదుపరి పంట సాగుకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేసింది. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని పల్లా వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, రైతు సంఘం, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కరువు రైతులకు రుణ ఊరట కల్పించండి

• 28 మండలాల్లో కరువు ప్రభావం..
• పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 4 (జనంసాక్షి): కరువు ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టాలని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్-2026 కరువు సహాయక చర్యల్లో భాగంగా ప్రత్యేక డీసీసీ, డీఎల్ ఆర్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపు గడువు పొడిగింపు, తాత్కాలిక వాయిదాల సదుపాయాలపై సమీక్షించారు. ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, బ్యాంకుల ఆమోదిత విధానాలకు అనుగుణంగా అర్హులైన రైతులకు సహాయక చర్యలు సకాలంలో అందించాలన్నారు. రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన రైతుల వివరాలను పక్కాగా సేకరించి నమోదు చేయాలని, అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.
లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలోని బ్యాంకులు 1,20,065 ఖాతాల ద్వారా రూ. 2,520.18 కోట్ల పంట రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం 28 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించగా, వీటిలో రెండు తీవ్ర కరువు, 26 మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా ఉన్నాయని వివరించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణను రుణమాఫీగా భావించరాదని, అర్హులైన రైతులకు రుణ చెల్లింపుల్లో వెసులుబాటు కల్పించే ప్రక్రియ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్‌డీఓ వి.ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి.శ్రీదేవి, బ్యాంకు ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ బాణసంచా నిల్వపై పోలీసుల దాడి!

• 513 బాణసంచా పెట్టెలు స్వాధీనం.. రెండు డీసీఎం వాహనాలు సీజ్!
• ఒకరు అదుపులో.. ముగ్గురిపై కేసు నమోదు!



బాలానగర్, నవంబర్ 4(జనంసాక్షి): బాలానగర్ మండలంలోని మోతిఘనాపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ బాణసంచా నిల్వను బాలానగర్ పోలీసులు పట్టుకున్నారు. హరిభజన్ సింగ్‌కు చెందిన డెయిరీ ఫామ్‌హౌస్‌లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 513 బాణసంచా పెట్టెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం.. బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచడంతో పాటు, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా బాణసంచా తరలింపునకు ఉపయోగిస్తున్న రెండు డీసీఎం వాహనాలను సీజ్ చేశారు. సంతోష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో బాణసంచాను తమిళనాడులోని శివకాశి నుంచి తీసుకొచ్చినట్లు వెల్లడైంది.

నామకరణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



సిర్గాపూర్, నవంబర్ 4 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన గోపాల్ కుటుంబంలో నిర్వహించిన నామకరణ మహోత్సవానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రావు పాటిల్, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

నేడు అంసాన్‌పల్లి పరిధిలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్

• విద్యుత్ శాఖ ఏఈ హైమద్ అలీ

కొల్చారం, నవంబర్ 04 (జనంసాక్షి): కొల్చారం మండలంలోని 33/11 కేవీ అంసాన్ పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొల్చారం విద్యుత్ శాఖ ఏఈ హమీద్ అలీ తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో పాటు నూతన ఏబి స్విచ్ ఏర్పాటు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

పేట స్వర్ణకార సంఘం అధ్యక్షులుగా లింగయ్యపల్లి నరసింహ చారి





పెద్ద శంకరంపేట, నవంబర్ 4 (జనంసాక్షి):
పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో స్వర్ణకార సంఘంలో నిర్వహించిన ఎన్నికల్లో లింగయ్య పల్లి ఆవుసుల నరసింహ చారి స్వర్ణకార సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. బుధవారం స్వర్ణకార సంఘం భవనంలో జరిగిన ఎన్నికల్లో 21 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పేట స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శిగా తిమ్మాయిపల్లి మహేష్ చారి, ఉపాధ్యక్షులుగా కాజిపల్లి రాజు, బాయికాడి సాయిప్రసాద్, కోశాధికారులుగా తిమ్మాయపల్లి సందీప్ చారి, బాయికాడి నరేష్ చారి, ఉప కార్యదర్శిగా కొడపాక గిరి బాబు, బాయికాడి శ్రీనివాస్‌గా నియమితులయ్యారు.

ఎల్నినోపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



గద్వాల, నవంబర్ 4(జనంసాక్షి): ఎల్నినో ప్రభావాలు, వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బెటర్ లైఫ్ స్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎండల తీవ్రత, నీటి కొరత, కరువు ముప్పులపై ప్లకార్డులతో నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంతలు నిర్మించి భూగర్భ జలాలను కాపాడాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. అడవుల విస్తీర్ణం పెంపు, నీటి సంరక్షణతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమని ఉపాధ్యాయులు వివరించారు.

బాలల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించాలి: సివిల్ జడ్జి బి.సౌజన్య

• బాలసదన్‌లో న్యాయ అవగాహన కార్యక్రమం
• జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్య



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 04 (జనంసాక్షి): బాలల హక్కులు, చట్టాలు, ఉచిత న్యాయ సేవలపై అవగాహన పెంపొందించేందుకు సంగారెడ్డిలోని బాలసదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య హాజరై బాలలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి బాలుడు, బాలికకు సమాన హక్కులు, గౌరవం, రక్షణతో పాటు నాణ్యమైన విద్య పొందే హక్కు ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, శారీరక, మానసిక వేధింపుల నుంచి రక్షణ, విద్యా హక్కు తదితర అంశాలను వివరించారు. బాలల అక్రమ రవాణా, దోపిడీ వంటి అసాంఘిక కార్యకలాపాల నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలో తెలియజేశారు.
బాలలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని, ఎలాంటి వేధింపులు, అన్యాయం ఎదురైనా భయపడకుండా ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు లేదా బాలల సంరక్షణ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు, ముఖ్యంగా బాలలకు చట్టాలపై అవగాహన కల్పించి, న్యాయ సేవలను అందరికీ చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

చిలప్‌చెడ్‌లో రూ.90 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం...

- మహిళా భవనం, ఎంఆర్‌సీ, సైన్స్ ల్యాబ్, భవిత కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

చిలప్‌చెడ్, నవంబర్ 4 (జనంసాక్షి): మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో రూ.90 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. మహిళా సమాఖ్య భవనం, మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ), సైన్స్ ల్యాబ్, భవిత కేంద్రం తదితర నిర్మాణాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వనరుల కేంద్రానికి రూ.41 లక్షలు, సైన్స్ ల్యాబ్‌కు రూ.12 లక్షలు, భవిత కేంద్రానికి రూ.9 లక్షలు, మహిళా సమాఖ్య భవనానికి రూ.10 లక్షలు, కాంపౌండ్ వాల్‌కు రూ.10 లక్షలు, కిచెన్ షెడ్‌కు రూ.4 లక్షలు, వాష్‌రూమ్ నిర్మాణానికి రూ.4 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు.



అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, పెన్షన్ల పెంపు వంటి హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు సకాలంలో యూరియా అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించగా, ప్రస్తుతం 6 నుంచి 9 గంటలే సరఫరా అవుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సర్పంచ్ జూల అనిల్ కోరిన మేరకు గ్రామంలోని విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జూల అనిల్, ఉపసర్పంచ్ రాములు, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, పలువురు సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉజలంపాడులో బాబాల మోసం

- దోషం ఉందని నమ్మించి 9 గ్రాముల బంగారం, ₹ రూ.45 వేలు ఎత్తుకెళ్లారు
- కేసు నమోదు చేసిన ఎస్ఐ మహేష్

సిర్గాపూర్, నవంబర్ 4 (జనంసాక్షి):
సిర్గాపూర్ మండలంలోని ఉజలంపాడు గ్రామంలో బాబాల ముసుగులో వచ్చిన కొంతమంది మోసానికి పాల్పడ్డారు. బిక్షాటన చేస్తూ గ్రామంలోకి వచ్చిన వారు యాదవ రావు ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఉన్న ఆయన భార్య దగ్గరకు వెళ్లి “నీకు దోషం ఉంది, పూజ జరిపించాలి” అంటూ మాయమాటలు చెప్పి నమ్మించారు.
పూజ పేరుతో ఆమె దగ్గర ఉన్న 9 గ్రాముల బంగారం మరియు రూ. 45,000 నగదు తీసుకొని అక్కడి నుంచి పారిపోయారు.బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది. ఇలా దోషం ఉందని చెప్పి వచ్చే అపరిచితులను నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మహేష్ ప్రజలకు సూచించారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు



శివ్వంపేట, నవంబర్ 4(జనంసాక్షి): మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ బీఎస్సీ చివరి సంవత్సరం పిల్లుట్ల బ్యాచ్ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవం (రావే) కార్యక్రమంలో భాగంగా పిల్లుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి నగేష్‌ను కలిసి గ్రామ జనాభా, రైతుల సమస్యలు, సదుపాయాల వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీ టీచర్‌ను అడిగి చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు సేకరించారు. పుస్తకాల్లో నేర్చుకున్న విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో అన్వయించుకోవడానికి రావే కార్యక్రమం ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీజ, పద్మావతి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఉషారాణిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



రాజోళి, నవంబర్ 4 (జనంసాక్షి):
మండలంలోని ముండ్లదిన్నె గ్రామానికి చెందిన పెద్దింటి నాగేష్ కుమార్తె ఉషారాణి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమె ప్రస్తుతం వెటర్నరీ డాక్టర్ కోర్సులో మూడో సంవత్సరం చదువుతుండగా..దసరా సెలవుల నిమిత్తం అలంపూర్ చౌరస్తా నుంచి ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా బోంకూరు గ్రామ సమీపంలో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే..ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు విరిగాయి. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో చికిత్స పొందిన అనంతరం స్వగ్రామానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బుధవారం ఉషారాణి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకుని తన చదువును పూర్తిచేసి వెటర్నరీ డాక్టర్‌గా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ మనోధైర్యం కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వడ్డేపల్లి మండల మాజీ జెడ్పీటీసీ కాశపోగు రాజు, గోపల్‌దిన్నె రవి, కోయిల్‌దిన్నె శేఖర్, డ్రైవర్ చిన్న, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం గిట్టుబాటు ధరపై ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

- కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్

మక్తల్, నవంబర్ 04 (జనంసాక్షి):
రైతు బాగుపడితేనే రాష్ట్రం, దేశం బాగుపడతాయని, ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీల కంటే రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కిసాన్ మోర్చా నారాయణపేట జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి, ఉపాధ్యక్షులు కర్ని స్వామి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన తరుణంలో, కొంతమంది రైతులు తమ ధాన్యాన్ని నేరుగా వ్యాపారులకు అమ్ముకుని మంచి ధర పొందుతుంటే ప్రభుత్వానికి ఎందుకు కడుపు మంటని వారు తీవ్రంగా ప్రశ్నించారు.



?కల్లాల వద్దకే వచ్చి వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయడం వల్ల రైతులకు రవాణా, మార్కెట్ ఖర్చులు తప్పి క్వింటాలుకు రూ. 4,000 నుండి రూ. 5,000 వరకు ధర లభిస్తోందని, దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని తెలిపారు.
ఇలాంటి సమయాలలో వ్యాపారస్తులను బెదిరించడం, రైతుల ప్రయోజనాలను విస్మరించి దాడులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమా అని వారు మండిపడ్డారు. ప్రభుత్వాలు రుణమాఫీలు, బోనస్‌ల కంటే రైతుల పంటకు మార్కెట్లో నిలకడైన మంచి ధర లభించేలా చూడటమే ముఖ్యమని నొక్కిచెప్పారు.
వర్షాలు లేక, ప్రాజెక్టులు ఎండిపోయి, అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు దెబ్బతిన్న క్లిష్ట పరిస్థితిలో, పక్క రాష్ట్రాల వ్యాపారులు వచ్చి ఎక్కువ ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తుంటే ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు. అధికారుల ఒత్తిడి కారణంగా పక్క రాష్ట్రాల వ్యాపారులు రాకపోవడం వల్ల ధాన్యం ధర పూర్తిగా తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే బీజేపీ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కనకరాజు, మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జావీద్ హుస్సేన్, ఓబీసీ మోర్చా నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

- ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడు, విద్యుత్ సౌకర్యం కరువు



మెదక్, నవంబర్ 4 (జనంసాక్షి): ధాన్యం విక్రయించేందుకు పొలానికి వెళ్తున్న రైతును గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. హవేలీ ఘనపూర్ మండలం బొరంగాబాద్‌కు చెందిన రైతు తిరుపతి కిషన్ (65) నవంబర్ 3 రాత్రి 10.45 గంటలకు పొలానికి వెళ్తుండగా బొరంగా బాద్ గేట్ సమీపంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టి పరారైంది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు.
అయితే ఆసుపత్రిలో డ్యూటీ వైద్యుడు అందుబాటులో లేకపోవడంతోపాటు విద్యుత్ సౌకర్యం కూడా లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్య సేవల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుర్తుతెలియని కారును సీసీటీవీ ఆధారంగా గుర్తించి చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని



మల్దకల్, నవంబర్ 4 (జనంసాక్షి): మండల పరిధిలోని మద్దెలబండ గ్రామంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఐఏఎస్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా,జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో మద్దెలబండ గ్రామంలో టివిసిఎస్ కళాబృందం తమ ఆటపాట మాటలతో... ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించారు.. గ్రామ సర్పంచ్ తిమ్మన్న గ్రామ ప్రజలు, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి.. రైతులు ఆరుతాడి పంటలే సాగు చేయాలని, కరెంటును పొదుపుగా వాడుకోవాలి మిగతా సమయాలలో వృధా చేయకూడదని సూచించారు.రైతుల పొలాల దగ్గర నీళ్ల తొట్టిలను ఏర్పాటు చేయాలని కళాకారులు సూచించారు. పశు గ్రాశంపై పశువులకు మేత గోర్లు బర్లకు ఎద్దులకు మేతపై గ్రామ ప్రజలు పెద్దలు ప్రజాప్రతినిధులు అధికారులు శ్రద్ధ తీసుకొని వాటికి అన్ని వసతులు కల్పించాలని కల్పించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ కళాకారులు హజరత్ రాహుల్,కేశవులు ప్రజలను చైతన్యపరిచారు.

అంబేద్కర్ సేవా సంఘం కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



జడ్చర్ల, నవంబర్ 4 (జనంసాక్షి): జడ్చర్ల పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని పెద్దల బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోయే మూడు సంవత్సరాల కాలానికి సంఘ సర్వతోముఖ అభివృద్ధికి, ప్రజా సేవా కార్యక్రమాలను విజయవంతం చేయడానికి నూతన కమిటీ అంకితభావంతో కృషి చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. సంఘ స్థాపకులు, చైర్మన్‌గా కొంగలీ మోహన్‌రాజ్, అధ్యక్షుడిగా కొంగలి శ్రీను ప్రధాన కార్యదర్శిగా కొంగళి శ్రీకాంత్, కార్యదర్శిగా ఆలూరి శశి కిరణ్, కోశాధికారిగా ఆలూరి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చిట్యాల శ్రీను, గంగారం భీమయ్య, కొడిగాంటి రవి, దేపల్లి రాజేష్, చిట్యాల రాజేష్ ఎన్నుకోబడగా, గౌరవ సలహాదారులుగా కొంగలీ జంగయ్య, దేపల్లి కృష్ణయ్య, కొంగరలీ నాగరాజు, దేపల్లి చిన్న భీమయ్య, దేపల్లి శ్రీను వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా కొంగళి ప్రశాంత్, తప్పటి శ్యామ్ సుందర్, తప్పెట విజయ్ కుమార్, కొంగళి శ్రీనివాస్, మహేందర్, ఆలూరి శేఖర్, రాజు, దేపల్లి రాము, దేపల్లి శ్రీకాంత్, కొంగళి జితేందర్, సూరజ్ కుమార్, మల్లేష్, మైపాల్ రెడ్డి, అశోక్, భీమప్ప, తపట్టి జంగీర్, కొంగలి విఘ్నేశ్ ఎన్నికయ్యారు.

సాదుల ఆత్మారాములుకు శాలువా, మెమంటోతో సత్కారం

- 16 కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడేలా చేసినందుకు సీపీ రష్మీ పెరుమాళ్ ప్రశంసలు



సిద్దిపేట (జనంసాక్షి): ఈ ఏడాది మొత్తం 16 విభిన్న కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు ఖరారయ్యేలా విశేష ప్రతిభ కనబరిచిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములును పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఘనంగా అభినందించి, సత్కరించారు.

?ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ... ఆత్మారాములు వాదించిన 16 కేసులలో 13 కేసుల్లో నిందితులకు 20 ఏళ్లు అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడేలా ప్రాసిక్యూషన్ విజయవంతంగా వాదనలు వినిపించిందని తెలిపారు. కోర్టు విచారణ సమయంలో పక్కా ఆధారాలు సమర్పించి, సమర్థవంతమైన వాదనలతో తీవ్ర నేరాలకు పాల్పడిన నేరస్తులకు శిక్షలు పడేలా చేయడంలో ఆయన చూపిన చొరవ, నిబద్ధత ప్రశంసనీయమని కొనియాడారు.

?బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చడంలో ప్రాసిక్యూటర్ పాత్ర అత్యంత కీలకమైనదని, ఆత్మారాములు అందించిన సేవలు పోలీస్ సిబ్బందికి మరియు ప్రాసిక్యూషన్ విభాగానికి ఆదర్శనీయమని సీపీ పేర్కొన్నారు. అనంతరం సాదుల ఆత్మారాములుకు శాలువా కప్పి, జ్ఞాపిక (మెమంటో) అందించి సీపీ రష్మీ పెరుమాళ్ ఘనంగా సత్కరించారు.

ఎల్‌నినోపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బిఆర్ఎస్, బిజెపిలకు బుద్ధి చెప్పండి

- ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ



సిద్దిపేట, నవంబర్ 04(జనంసాక్షి): సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ సమావేశంలో చైర్మన్ పూజల గోపికృష్ణ అధికారులను, కమిటీ డైరెక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీపై అందిస్తున్న విత్తనాలు, వ్యవసాయ సంబంధిత సబ్సిడీలు అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామాల వారీగా ఎప్పటికప్పుడు అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గడం, వర్షాలు ఆలస్యంగా కురవడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని చైర్మన్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేసుకునే పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, విత్తన ఎంపిక, పంటల యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని తెలిపారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అన్నారు.

అదేవిధంగా రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, వాటి అర్హతలు, ప్రయోజనాలు, దరఖాస్తు విధానాలపై స్పష్టంగా వివరించాలని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి అధికారులు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని అర్హులైన రైతులకు చేరయేయడమే మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు..ఈ సమావేశంలో అధికారులు, ఆత్మ కమిటీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ మాయం కలకలం



చేర్యాల, నవంబర్ 04(జనంసాక్షి):
చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ మాయం కావడం కలకలం రేపుతోంది. ప్రభుత్వ కార్యాలయంలోనే కంప్యూటర్ కనిపించకుండా పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయంలో పనిచేసే వారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయంలోనే వస్తువులు మాయమవుతుండటంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. సమగ్ర విచారణ జరిపి కంప్యూటర్ మాయం వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయాలని పలువురు కోరుతున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై బీజేపీ సమావేశం



గద్వాల, నవంబర్ 4 (జనంసాక్షి): దరూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కార్యకర్తలు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి గ్రామంలో పర్యటించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఫారం-18 పూర్తి చేయించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, విద్యావంతులు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని అన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు.

నమోదు ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, బండల వెంకటరాములు, బాబుల్ రెడ్డి, రాజేష్ అయ్యా, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవాన్ రమేష్ నాయక్ గారికి ఘన నివాళులు

- ఆరోగ్యపరమైన కారణాలతో మృతి



కడపల్ తాండ (సిర్గాపూర్), నవంబర్ 4 (జనంసాక్షి):
భారత సైన్యంలో జవాన్ గా దేశ సేవ చేసిన కడపల్ తాండ గ్రామానికి చెందిన రమేష్ నాయక్ గారు ఆరోగ్యపరమైన కారణాలతో మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా, సిర్గాపూర్ మండలం, కడపల్ తాండ గ్రామానికి చెందిన రమేష్ నాయక్ గారు సైన్యంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి వార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.దేశ సేవలో తన జీవితాన్ని అంకితం చేసిన రమేష్ నాయక్ గారి సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకుంటూ కన్నీటితో నివాళులు అర్పిస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కృష్ణ, నవంబర్ 4 (జనంసాక్షి): కృష్ణ మండలం రైల్వే ట్రాక్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యక్తి బ్లూ కలర్ షర్టు, బ్లాక్ పాయింటు ధరించి ఉన్నాడు వ్యక్తిని ఎవరికైనా తెలిస్తే కృష్ణ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712671023కు, కాల్ చేసి చెప్పాలని ఎస్ఐ నవీద్ తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఊర్కొండ, నవంబర్ 4 (జనంసాక్షి): మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో సీఎం ఎస్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులను అధికారులు బుధవారం పరిశీలించారు. పంచాయతీరాజ్ ఏఈ శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పోలె శ్రీనివాస్ పనుల అంచనాలు, నిర్మాణ ప్రణాళికలను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. పనులను త్వరగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సర్పంచ్ చెరుకు తిరుపతమ్మ శివయ్య, ఉపసర్పంచ్ బోయని తిరుపతయ్య కోరారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి అందరూ పార్టీలకతీతంగా సహకరించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు చెక్ పెట్టేలా సమగ్ర రీసర్వే: అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

- రైతుల సమక్షంలో పారదర్శకంగా భూముల కొలతలు చేపట్టాలి





వనపర్తి, నవంబర్ 4 (జనంసాక్షి):
భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా పక్కా భూ రికార్డుల రూపకల్పనకు సమగ్ర భూ రీసర్వే కీలకమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అన్నారు. రీసర్వే పనులను వేగవంతం చేసి, రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

బుధవారం వనపర్తి మండలం నాచహళ్లి, కొత్తకోట మండలం నాంచారమ్మపేట, పుల్లారెడ్డికుంట గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూర్తయిన సర్వే పనుల పురోగతి, రికార్డులను తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేందుకు రెవెన్యూ, సర్వే శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సర్వేకు ముందుగా రైతులు, గ్రామస్తులకు సమాచారం అందించాలని, భూముల కొలతల సమయంలో సంబంధిత యజమానులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. భూ యజమానుల సమక్షంలో కొలతలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో భూ సరిహద్దులు, హక్కులకు సంబంధించిన వివాదాలను నివారించవచ్చన్నారు.

సర్వేలో తప్పిదాలకు తావులేకుండా నాణ్యమైన రికార్డులు రూపొందించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, కొత్తకోట తహసీల్దార్ సుభాష్ నాయుడు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకై అక్షర పోరాటం పుస్తకావిష్కరణ



జడ్చర్ల, నవంబర్ 4 (జనంసాక్షి):
పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ రచించిన 'బీసీల హక్కుల సాధనకై అక్షర పోరాటం' పుస్తకాన్ని బుధవారం స్థానిక విలేకరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు కృష్ణ, సురేందర్ మాట్లాడుతూ బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ అవకాశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు పుస్తకం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ మూడు ట్రాక్టర్ల పట్టివేత



చేర్యాల, నవంబర్ 04 (జనంసాక్షి):
చేర్యాల మండలంలోని చుంచనకోట గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మట్టితో ఉన్న టిప్పర్ మూడు ఖాళీ ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అపూర్వరెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బొక్కస్‌గావ్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం: ఎమ్మెల్యే డా.పట్లోళ్ల సంజీవ్ రెడ్డి

సిర్గాపూర్, నవంబర్ 4 (జనంసాక్షి): సిర్గాపూర్ మండలం బొక్కస్‌గావ్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ్







రెడ్డి , ఈరోజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్మకూడదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తగిన గుర్తింపు పత్రాలతో ధాన్యాన్ని అప్పగించి మద్దతు ధర పొందాలని సూచించారు.లి2026-27 ఖరీఫ్ మద్దతు ధర గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,441,కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ధాన్యం తూకం, చెల్లింపుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. బొక్కస్‌గావ్ కేంద్రం ద్వారా సిర్గాపూర్ మండల రైతులకు సమీపంలోనే ధాన్యం అమ్మే అవకాశం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ..



పాపన్నపేట,నవంబర్ 4 (జనంసాక్షి) :
రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను నార్సింగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేశం,కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు నారాయణ గౌడ్,ఉపసర్పంచ్ నరేష్,పంచాయతీ కార్యదర్శి వెంకటేశం తదితరులు ఉన్నారు.

అంసాన్‌పల్లి గ్రామంలో పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ

- జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఆదిత్య వర్మ



కొల్చారం, నవంబర్ 04(జనంసాక్షి):
కొల్చారం మండలంలోని అంసాన్ పల్లి గ్రామంలో ఆవులు, దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులు జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఆదిత్య వర్మ ఆధ్వర్యంలో పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ మందులు పశువుల ఆరోగ్యం, ఎదుగుదలకు, పాల దిగుబడి పెరగడానికి ఉపయోగకరంగా ఉంటాయని జిల్లా పశు వైద్యాధికారి తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ వీరేశం, ఓ యం యాదగిరి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ చెన్నయ్య, మైపాల్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం



కొల్చారం, నవంబర్ 04 (జనంసాక్షి):
ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచ్ దేవన్నగారి శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.
ఎల్‌నినో ప్రభావంతో పాటు అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
వరి కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన, నిల్వ ఉంచిన ధాన్యం భారీ వర్షాలకు తడిసి రైతులు నష్టపోయారని అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు అధైర్యపడవద్దని, ప్రజా పాలన ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.
ధాన్యం తడిసిందనే కారణంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.
నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపు తోందని వారు పేర్కొన్నారు.

రైతు తిరుపతి కిషన్ మృతి బాధాకరం: కంటారెడ్డి తిరుపతిరెడ్డి

- ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు: కంటారెడ్డి తిరుపతిరెడ్డి

మెదక్, నవంబర్ 4 (జనంసాక్షి):
ఔరంగాబాద్‌కు చెందిన రైతు తిరుపతి కిషన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి పొలం వద్ద కోసి ఉంచిన వరి ధాన్యం వద్దకు వెళ్లుండగా తిరుపతి కిషన్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసే పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఇప్పటికే రైతులు పంటలు కోసి ధాన్యం సిద్ధం చేసుకున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్



చేశారు.
ప్రమాదం అనంతరం ఆసుపత్రికి తీసుకొచ్చిన సమయంలో విద్యుత్ సరఫరా లేదని, సకాలంలో వైద్యం అందించి ఉంటే ప్రాణాలు దక్కేవని కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు తెలిపారు. దీనిపై విధుల్లో ఉన్న వైద్యురాలిని వివరణ కోరగా, రోగిని తీసుకొచ్చే సమయానికే పల్స్ లేదని చెప్పినట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖ అధికారి మోహన్‌బాబును పిలిపించి విచారించగా, ఆసుపత్రికి విద్యుత్ సరఫరా ఉందని, సిబ్బందే నిలిపివేశారని తెలిపినట్లు పేర్కొన్నారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండాలని, రాత్రివేళ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ఆసుపత్రి పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.
కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, బీమరి కిషోర్, చంద్రమోహన్ గౌడ్, గంజి నవీన్, సతీష్ రావు తదితరులు పాల్గొన్నారు.

వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి పరామర్శ...

- అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి: ఓరుగంటి ఆనంద్

చేర్యాల, నవంబర్ 4 (జనంసాక్షి): తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ బుధవారం పరామర్శించారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.
అనంతరం ఆనంద్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా అమరుల ఆశయాలు నెరవేరలేదని, వారి కుటుంబాలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఉద్యమకారుల సమస్యలపై కేకే కమిటీ కాలయాపన చేయకుండా వెంటనే నివేదిక సమర్పించాలని డిమాండ్ చేశారు. లక్ష్మణ్ గౌడ్ భార్యకు అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, అర్హులైన



ఉద్యమకారులకు పెన్షన్లు, ఇంటి స్థలాలు, ఉచిత వైద్యం, విద్య అందించాలని కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి మల్లేష్ గౌడ్, చిలువేరు రమేష్, నర్రా సంపత్, ముక్కెర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కూర్ లో కూరగాయల సంత ప్రారంభించిన గ్రామ సర్పంచ్

ముల్దకల్, నవంబర్ 4 (జనంసాక్షి): మండల పరిధిలోని ఎల్కూర్ గ్రామంలోని బుధవారము(గ్రామ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల సంతను గ్రామసర్పంచ్ బి.వినోద్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహించే కూరగాయల సంత ద్వారా గ్రామ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటు



ధరల్లో లభిస్తాయని తెలిపారు. అలాగే రైతులు,చిరు వ్యాపారులకు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మంచి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో చక్రధర్ రెడ్డి,ఉపసర్పంచ్ తిమ్మప్ప, వార్డు మెంబెర్స్,మాజీ జడ్పీటీసీ భాస్కర్,మాజీ కోఆప్షన్ హైదర్, గ్రామ పెద్దలు,యువకులు గ్రామ ప్రజలు,రైతులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్ సమీపంలో వాహన తనిఖీలు

- హెల్మెట్ పై CI రఘువీర్ రెడ్డి అవగాహన



వెల్దండ, నవంబర్ 04 (జనంసాక్షి):
వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామ సమీపంలోని చీఎ-765 జాతీయ రహదారిపై ఈరోజు వెల్దండ CI గారి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులను ఆపి CI గారు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని సూచించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు.
వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ తనిఖీల్లో పోలీస్ ఎస్సై యుగేందర్ రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తెలుగుజాతి గర్వించదగ్గ కవయిత్రి మొల్ల

- నన్నయ్య ఆదికవి అయితే మొల్ల ఆది కవయిత్రి
- అచ్చ తెలుగులో రామాయణం రచించిన ధీరవనిత
- నవంబర్ 11న విగ్రహ భూమిపూజకు కుమ్మరులంతా తరలిరావాలి

శ్రీరంగాపురం, నవంబర్ 04 (జనంసాక్షి): తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి అని మాజీ కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ బొడ్డుపల్లి పరుశురాం, శ్రీరంగాపురం కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కుమ్మరి గోవిందు అన్నారు. బుధవారం శ్రీరంగాపురంలో కుమ్మరులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఈ నెల 11న వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా మొల్లమాంబ విగ్రహ భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నన్నయ్య ఆదికవి అయితే మొల్ల ఆది కవయిత్రి అని, తెలుగు సాహిత్య చరిత్రలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉందని కొనియాడారు. మొల్ల విగ్రహ భూమిపూజ కార్యక్రమానికి వనపర్తి జిల్లా పరిధిలోని కుమ్మర కుటుంబ సభ్యులు, కుల పెద్దలు, యువత, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘం ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బొడ్డుపల్లి మన్యం, సంఘం మండల అధ్యక్షుడు శేఖర్, యువజన అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం.. మార్కెట్ అభివృద్ధే ధ్యేయం...

- రైతుల సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం కృషి చేయాలి
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



బెజ్జంకి,నవంబర్ 4,(జనంసాక్షి): మండలంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధ వారం నూతన ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకా రోత్సవానికి ముఖ్య అతిథి గా మానకొండూరు ఎమ్మె ల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్ నూతన చైర్‌పర్సన్‌గా మాతంగి శిరీష అనిల్,వైస్ చైర్మన్‌గా పర్ష సంతోష్ కుమార్‌తో పాటు డైరెక్టర్లుగా జెల్లా రాజేశ్వరి,దేశరాజు అనిల్,నందికొండ తిరుపతిరెడ్డి, మైసంపల్లి తిరుపతి, ఇస్కిల్ల ఐలయ్య, జీల లింగంరెడ్డి రామకృష్ణారెడ్డి,





మహమ్మద్ సాదిక్, కుంట హరికృష్ణ, ఎలకంటి శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి కృష్ణారావు, గుండా వెంకట్ రెడ్డికీ ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతుల కష్టాలను అర్థం చేసుకొని వారి సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.నియోజకవర్గంలోనే అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీతో పాటు ఉచిత విద్యుత్,ఎరువులు, విత్తనాలు అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది అనీ అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు కాంగ్రెస్‌లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, పదవులు రానివారు నిరాశ చెందకుండా పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని అన్నారు. తన వెన్నంటి నిలిచి పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. మాతంగి అనిల్ పార్టీ కోసం చేసిన కృషికి గుర్తింపు



గానే ఆయన సతీమణి శిరీషకు ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి దక్కింది అనీ అన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం.. భారీ ర్యాలీ...

ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కేడీసీసీ బ్యాంకు చైరస్తా వద్ద నాయకులు,కార్యకర్తలు,మహిళలు ఘన స్వాగతం పలికారు.అక్కడి నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించగా,ఎడ్లబండి చౌరస్తాలో గోమాత విగ్రహాలకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఒగ్గు దామోదర్, అక్కరవేణి పోచయ్య,ఏఎంసీ మాజీ చైర్మన్ పులి కృష్ణ,మాజీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్,బైరా రాజేందర్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్,కత్తి రమేష్,శానగొండ శ్రావణ్,శరత్,జెల్ల ప్రభాకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి
- పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చేర్యాల, నవంబర్ 04 (జనంసాక్షి):
చేర్యాల మండలాల పరిధిలోని వేచరేణి,పోతిరెడ్డిపల్లి, నాగపురి, పెదరాజపేట, శభాష్ గూడెం గ్రామాలలో ఐకేపీ సెంటర్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పక్కతి వైపరీత్యాలను ఎదుర్కొని ఎంతో కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేసి సొమ్ముచేసుకుంటున్నారు. రైతు కష్టం తెలిసిన ప్రజాప్రభుత్వం ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ముఖ్యంగా ధాన్యం తూకం, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలి,



ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ సంచులు, తూకం యంత్రాలు, ఇతర సౌకర్యాలను అందుబాటులో తీసుకు వచ్చి, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

రైతులకు ఎలాంటి కష్టం లేకుండా ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర, కొనుగోలు విధానంపై అవగాహన కల్పిస్తూ, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంజ మల్లేష్, చేర్యాల పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, సంబంధిత ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ,ఆత్మ కమిటీ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్లు, గ్రామ సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, సీసీలు, సిఎలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

12వసారి ఏకగ్రీవంగా బంగి రంగారావు ఎన్నిక

- ఎల్ఐసీ ప్రైవేటీకరణను అంగీకరించం: మద్దిలేటి



గద్వాల, నవంబర్ 4 (జనంసాక్షి): లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అంగీకరించబోమని ఐసీఈయూ హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి మద్దిలేటి అన్నారు. గద్వాల ఎల్ఐసీ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ 36వ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడులు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు ఐక్యంగా పోరాడా లని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శిగా బంగి రంగారావును 12వసారి ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్, జాయింట్ కార్యదర్శులుగా సూరజ్, రాఘవేంద్ర ఎన్నికయ్యారు. సమావేశంలో ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు భూపతి దాస్‌కు అశ్రునివాళి



వెల్దండ, నవంబర్ 4 (జనంసాక్షి): వెల్దండ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపతి దాస్ మంగళవారం తుక్కుగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేసిన మంచి ఉపాధ్యాయుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిన ప్రేమ, క్రమశిక్షణ మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీను, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ నాయక్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడే పశువుల ఆరోగ్య - సంతానోత్పత్తి వైద్య శిబిరం

- VB-G RAM G పథకంపై అవగాహన
- పశు వైద్యాధికారి రజిత



శ్రీరంగాపూర్, నవంబర్ 4 (జనంసాక్షి): శ్రీరంగాపూర్ మండలంలోని షేరుపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తేదీ 05-11-2026 (గురువారం) ఉదయం 7:30 గంటలకు పశువులకు ఆరోగ్య మరియు సంతానోత్పత్తి (Health & Fertility) వైద్య శిబిరం నిర్వహించబడుతుంది.

ఈ శిబిరంలో పశువులకు ఆరోగ్య పరీక్షలు, వ్యాధుల నిర్ధారణ, అవసరమైన చికిత్సలు, నట్టల నివారణ, సంతానోత్పత్తి సమస్యల గుర్తింపు మరియు తగిన వైద్య సలహాలు అందించబడతాయి.

అదేవిధంగా, (VB-G RAM G) పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద అభివృద్ధి, పశువులకు అవసరమైన పశుగ్రాసం లభ్యత పెంపు మరియు పశుపోషకుల జీవనోపాధి మెరుగుదలకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించబడుతుంది.

కావున షేరుపల్లి గ్రామంలోని రైతులు, పశుపోషకులు తమ ఆవులు మరియు గేదెలను ఈ వైద్య శిబిరానికి తీసుకువచ్చి, పశువైద్య సేవలను,

ప్రభుత్వ పథకాలపై కల్పించే అవగాహనను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి రజిత కోరడమైనది.

రియల్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి ఎమ్మెల్యే సన్మానం



నారాయణఖేడ్, నవంబర్ 04 (జనంసాక్షి):
తెలంగాణ రియల్టర్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన పుట్టి సాయిలును నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన సాయిలును శాలువాతో సన్మానించి అభినందించారు. రియల్టర్ల సంక్షేమం, సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తనకు సహకరించిన రియల్టర్లకు, అభినందించిన ఎమ్మెల్యేకు సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, సంగమేశ్వర్, రాధాకిషన్, మన్నె కృష్ణ, రఘుపతిరెడ్డి, జలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలే లక్ష్యం...

- బెంగళూరు స్కిల్ సమ్మిట్-2026లో పాల్గొన్న టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి,నవంబర్ 4 (జనంసాక్షి):
తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) పనిచేస్తోందని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న బెంగళూరు స్కిల్ సమ్మిట్-2026లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఆయన పాల్గొన్నారు.
ఈ జాతీయ స్థాయి సదస్సులో టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డితో కలిసి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత విద్యార్హతలతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. కృత్రిమ మేధస్సు, ఇండస్ట్రీ 4.0, అధునాతన సాంకేతిక రంగాలు, పర్యావరణహిత ఉద్యోగాలకు సంబంధించిన నైపుణ్యాల్లో శిక్షణ పొందడం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.పరిశ్రమల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా యువతకు శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం పెంపొందించాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు లభించేలా ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.
బెంగళూరు స్కిల్ సమ్మిట్ వంటి జాతీయ, అంతర్జాతీయ వేదికలు వివిధ రాష్ట్రాలు, ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, నైపుణ్యాభివృద్ధి భాగస్వాములతో అనుసంధానం కావడానికి దోహదపడతాయని చెప్పారు. ఇలాంటి సదస్సుల ద్వారా ఆధునిక శిక్షణ విధానాలు, పరిశ్రమల అవసరాలు, కొత్త ఉపాధి అవకాశాలను తెలుసుకొని తెలంగాణలో అమలు చేసేందుకు వీలుంటుందని వివరించారు.
టాస్క్ ద్వారా రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని



తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతకు సైతం ఆధునిక సాంకేతిక శిక్షణ, మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వ సహకారం, పరిశ్రమల భాగస్వామ్యం, విద్యాసంస్థల సమన్వయంతో తెలంగాణ యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి, సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డితో పాటు పలువురు టాస్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.




రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్ పైపుల పంపిణీ

- పాలమూరు ఎంపీ డీకే అరుణ సహకారంతో రైతులకు పరికరాల అందజేత..
- పంపిణీ చేసిన బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

ఉర్కొండ, నవంబర్ 04 (జనంసాక్షి): ఊరుకొండ మండల పరిధిలోని రాచాలపల్లి గ్రామంలో రైతులకు సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్ పైపులను బుధవారం పంపిణీ చేశారు. పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సహకారంతో రైతులకు ఈ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి రైతులకు స్ప్రింక్లర్ పైపులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె.రాజేందర్ గౌడ్,జిల్లా కౌన్సిల్ నెమరు లక్ష్మారెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి,సందీప్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను ఏరివేయాలి

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి: ఎమ్మెల్సీ అంజిరెడ్డి



రామచంద్రపురం, నవంబరు 4(జనంసాక్షి): ఓటరు జాబితాలో నకిలీ ఓట్లను ఎప్పటికప్పుడు గుర్తించి తొలగించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. భారతీనగర్‌లో నిర్వహించిన మేధావుల చర్చా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రత్యేక పరిస్థితులు, వలస ఓటర్ల సమస్యలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన ఆవశ్యకతపై మేధావులతో చర్చించినట్లు తెలిపారు. పారదర్శక ఎన్నికలతోనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూడటంతోపాటు, బోగస్ ఓట్ల ఏరివేతలో ప్రజలు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌గౌడ్, సీనియర్ నాయకులు రఘువేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పాఠశాలను సందర్శించిన ప్రొఫెసర్ రాధాకృష్ణ



మల్దకల్, నవంబర్ 3 (జనంసాక్షి):
తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రముఖ నిపుణుల పర్యవేక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ రాధాకృష్ణ మల్దకల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అభ్యసన స్థాయిలు, విషయ పరిజ్ఞానం, ఆలోచనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, మానసిక వికాసం పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.సురేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎంయు. రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దూర్‌లో ప్రశస్త్ స్క్రీనింగ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

- ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల గుర్తింపునకు ప్రశస్త్ దోహదం



మద్దూర్, నవంబర్ 4 (జనంసాక్షి): మద్దూర్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంపిక చేసిన స్ట్రాంగ్ టీచర్లకు ప్రశస్త పార్ట్ వన్ స్క్రీనింగ్ పై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ పిలు రాజు నాయక్, ఇబ్రహీం, గీత ఉపాధ్యాయులకు ప్రశస్త్ స్క్రీనింగ్ విధానంపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు ప్రశస్త్ స్క్రీనింగ్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. విద్యార్థుల్లో వినికిడి, చూపు లోపాలు, శారీరక కదలికల్లో ఇబ్బందులు, చదవడం, నేర్చుకోవడంలో ఎదురయ్యే సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన సహాయం అందించవచ్చన్నారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు బాధ్యతగా వ్యవహరించి ఒక్క ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థి కూడా గుర్తింపునకు దూరం కాకుండా ప్రశస్తు పార్ట్ వన్ స్క్రీనింగ్‌ను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఉప్పల వెంకటేష్

- దేవాలయాల పునర్నిర్మాణానికి సొంత నిధులతో సహకారం..
- జర్నలిస్టు శేఖర్ పిల్లల విద్యాభ్యాసానికి ఫీజుల చెల్లింపు హామీ

కల్వకుర్తి, నవంబర్ 4 (జనంసాక్షి): కల్వకుర్తి మండలం, మున్సిపల్ పరిధిలో బుధవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పాల్గొన్నారు. ఎల్లికట్ట గ్రామంలోని హనుమాన్, శివాలయం, చెన్నకేశవ స్వామి దేవాలయాల పునర్నిర్మాణ పనుల్లో భాగంగా పైకప్పు నిర్మాణానికి తన సొంత నిధులతో సహకరించేందుకు నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు, డ్యాన్స్ మాస్టర్ శేఖర్‌ను పరామర్శించి





ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శేఖర్ ఇద్దరు పిల్లల ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాల ఫీజులను తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు.
అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన ఉచిత కేంద్రాన్ని పరిశీలించారు. అర్హులైన పట్టభద్రులు వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు కోరల్లో రైతాంగం.. ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం అందించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

బెజ్జంకి,నవంబర్ 4,(జనంసాక్షి): మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో కరువు పరిస్థితులు, సాగునీటి కొరతతో ఎండిపోయిన పంటలను బుధవారం సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ అప్పులు చేసి సాగు చేసిన పంటలు నీటి కొరతతో కళ్లముందే ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల రూపంలో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని అన్నారు.పంట నష్టపోయిన రైతులకు





కేవలం ఓదార్పు సరిపోదని, ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించడంతో పాటు తదుపరి పంట సాగుకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేశ్,మండల సహాయ కార్యదర్శి కల్లూరి బాలమల్లు పరశురాములు,సంఘ తిరుపతి, బోనగిరి శ్రవణ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతర వేణి మహేష్, ఏవైఎఫ్ మండల అధ్యక్షుడు రాకేష్, కనగండ్ల చంద్రయ్య కుంభం రాములు,బర్ల రాజు, చిన్న తిరుపతిరెడ్డి,రామచ శేఖర్, కనగండ్ల కనకయ్య, రొడ్డ చరణ్, తిరుపతి, గొర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరు గ్రామంలో పారిశుధ్యంపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి



వెల్దండ, నవంబర్ 04 (జనంసాక్షి): వెల్దండ మండలంలోని చెరుకూరు గ్రామాన్ని చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బందితో తొలగించారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా రోజువారీ శుభ్రం చేస్తున్నామని సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్తులు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా, పంచాయతీ ట్రాక్టర్‌కు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లాలయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలి

• ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పిలుపు

రామచంద్రాపురం,అక్టోబర్ 4(జనంసాక్షి): జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రామచంద్ర లో జరిగిన ఐ జే యు టీ యు డబ్ల్యూ జే రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించాలని, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు జర్నలిస్టు సంఘాలు చొరవ చూపాలని సూచించారు. జర్నలిస్టులకు సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు లభించేలా కృషి చేయాలని, వారి హక్కుల పరిరక్షణకు నిబద్ధతతో పనిచేయాలని అన్నారు.

ఏ ప్రభుత్వానికీ తలొగ్గకుండా జర్నలిస్టుల సమస్యలను ధైర్యంగా ప్రస్తావించాలని పేర్కొన్నారు. జర్నలిస్టులకు వారి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందనే భరోసా కల్పించాలన్నారు. ప్రతి సమస్యకు ఆలోచనా శక్తి, అనుభవం, విచక్షణతో పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కును కాపాడటంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల వృత్తిపరమైన బాధ్యతని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జర్నలిజం విలువలకు విరుద్ధంగా బ్లాక్‌మెయిలింగ్ వంటి చర్యలకు పాల్పడకుండా వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు.



ఇళ్ల స్థలాల సమస్యపై ప్రత్యేక దృష్టి...

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ప్రతి జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల వివరాలు, ఇళ్ల స్థలాల సమస్యకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఈ వివరాలను రెండు మూడు రోజుల్లో ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా స్థాయి నాయకత్వం సమాచారాన్ని సేకరించి రాష్ట్ర నాయకత్వానికి సమర్పించాలని సూచించారు. ఈ విషయంలో జిల్లా, రాష్ట్ర నాయకత్వాలు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

మెట్రో, ఆర్టీసీ పాస్‌ల సమస్యల పరిష్కారానికి కృషి...

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న మెట్రో రైలు, ఆర్టీసీ పాస్‌ల సమస్యలను



సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదే తరహాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

ప్రెస్ అకాడమీ, జర్నలిస్టు సంఘం సాధించే విజయాలు ఏ ఒక్క వ్యక్తికో పరిమితం కావని, అవి యావత్ జర్నలిస్టు సమాజం సమష్టి కృషికి దక్కే ఫలితాలని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఐకమత్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేవులపల్లి అమర్,విరాసత్ అలీ,రాంనారాయణ,ఫైజల్,కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిగా అనర్హుడివి

• పంట నష్టాన్ని అంచనా వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం
• మొక్కుబడిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ
• సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సునిత రెడ్డి ఫైర్

హత్నూర, నవంబర్ 4 (జనంసాక్షి):

ఒక అధికారిగా అనర్హుడివంటూ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు పై ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఫైర్ అయ్యారు.మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.ప్రధానంగా వ్యవసాయ శాఖ





అధికారుల అనుసరిస్తున్న పని తీరుపై నిప్పులు చెరిగారు.ఎల్ నినో కారణంగా ఎండిన పంటలు, ముంచుకొస్తున్న మురసు తుఫాను వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులపై వ్యవసాయ శాఖ అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహజ్వాలలు వ్యక్తమయ్యాయి.రైతులు ఓ వైపు పంటలనూర్పి వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తుండగా ఎల్ నినో కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేయడంలో సంబంధిత అధికారులు నిరాసక్తత కనబరుస్తున్నారని మండి పడ్డారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయకుండా జాప్యం వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.రైతులకు మార్గదర్శకంగా ఉండాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌కు బలైన
మూడు పాడి ఆవులు.. రైతుకు తీరని నష్టం!

బాలానగర్, నవంబర్ 4 (జనంసాక్షి):



మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని జాలుగడ్డ గ్రామపంచాయతీ పరిధి పలుగుగడ్డ తండాలో మంగళవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్‌షాక్‌కు గురై మూడు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి.

తండాకు చెందిన విస్లావత్ బిక్య నాయక్‌కు చెందిన మూడు పాడి ఆవులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంతో ఆయనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. పాడి ఆవులే జీవనాధారంగా జీవనం సాగిస్తున్న బాధితుడు, ఒక్కసారిగా మూడు ఆవులను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు.

జీవనోపాధికి ఆధారమైన పశువులు మృతి చెందడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనలో మునిగిపోయింది. సంబంధిత అధికారులు ఘటనపై విచారణ జరిపి, నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి బాధిత రైతుకు తగిన ఆర్థిక పరిహారం అందించి ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

భగవద్గీత పఠనంలో చిన్నారి శ్రీప్రియ సంచలనం!

• రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం...
• జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
• నవంబరు 21, 22 తేదీల్లో పుణెలో జరిగే పోటీల్లో ప్రతిభ చాటేందుకు సిద్ధం

నంగునూరు, నవంబరు 4 (జనంసాక్షి):



చిన్న వయసులోనే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అలవర్చుకుని భగవద్గీత పఠనంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన చిన్నారి శ్రీప్రియ జాతీయ స్థాయికి ఎంపికై ప్రశంసలు అందుకుంటోంది. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. నవంబర్ 21, 22 తేదీల్లో మహారాష్ట్రలోని పుణెలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ వేదికపైకి అడుగుపెట్టడం చిన్నారి శ్రీప్రియ విజయానికి నిదర్శనంగా నిలిచింది.

సిద్దిపేటకు చెందిన ఉపాధ్యాయ దంపతులు నాగేందర్, స్రవంతిల పదేళ్ల కూతురు శ్రీ ప్రియ ఈ ఘనతను సాధించింది. శ్రీ ప్రియ ప్రస్తుతం సిద్దిపేటలోని మోడ్యులస్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతోంది. చిన్మయ మిషన్ ప్రతి సంవత్సరం భగవద్గీత పఠనంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల వరకు కొనసాగుతాయి. ఈ క్రమంలో కడపలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీప్రియ తన అద్భుతమైన పఠన ప్రతిభతో న్యాయ నిర్ణేతలను ఆకట్టుకుని రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. భగవద్గీత పఠనం కేవలం శ్లోకాలను వల్లె వేయడానికే పరిమితం కాదని చిన్మయ మిషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సత్ప్రవర్తన, మంచి నడవడిక, స్పష్టమైన ఉచ్చారణ, వాక్శుద్ధి, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించడంలో ఇది దోహదపడుతుందని తెలిపారు. అంతేకాకుండా ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం, సాంస్కృతిక అనుసంధానం పెరుగుతాయని వివరించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా, స్థిరమైన మనస్సుతో ఎదుర్కొనే ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు భగవద్గీత పఠనం ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు.



ప్రతి సంవత్సరం పాఠశాల, జిల్లా స్థాయిల్లో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో మొదటి, రెండో స్థానాలు సాధించిన వారికి జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి శ్రీప్రియ జాతీయ స్థాయికి చేరుకోవడం విశేషం.

అభినందనల వెల్లువ..

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన చిన్నారి శ్రీప్రియపై విద్యార్థులు, ఆధ్యాత్మికవేత్తలు, పలువురు ప్రముఖులు అభినందనలు కురిపించారు. పుణెలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే భగవద్గీతపై ఆసక్తి పెంచుకుని జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమని కొనియాడారు.



ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు

రూ. 36,600 భారీ జరిమానా

శంషాబాద్,నవంబర్4(జనంసాక్షి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని శంషాబాద్ ఆర్జిఐఏ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 3న మొత్తం 18 కేసులను పరిష్కరించి రూ. 36,600 జరిమానా విధించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రాజేంద్రనగర్ 10వ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ఒక్కరోజు సాధారణ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమానా విధించారు. మరో ఐదు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ. 23,200, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఆరు కేసుల్లో రూ. 9,400 జరిమానా విధించినట్లు ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

వాటర్ ట్యాంకర్ల సమ్మె విరమణ హర్షణీయం

సమస్య పరిష్కరించినందుకు హైడ్రాకు అభినందనలు

హైడ్రా కమిషనర్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపిన హాస్టళ్ల నిర్వాహకులు

హైదరాబాద్, నవంబర్ 04 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో నీటి ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించడం పట్ల హాస్టళ్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంకర్ల యజమానులతో వెంటనే మాట్లాడి సమస్యను పరిష్కరించినందుకుగాను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హాస్టళ్ల నిర్వాహకుల సంఘం ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ను కలిసారు. హాస్టళ్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సమస్య పరిష్కారానికి చొరవ చూపిన హైడ్రా కమిషనర్‌కు హాస్టళ్ల యజమానుల సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. జీవనోపాధి, విద్య, ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది వస్తున్నారని, నగరంలోని హాస్టళ్లలో వేలాది మంది ఉంటూ నీటి అవసరాల కోసం ట్యాంకర్ల సరఫరాపై ఆధారపడుతున్నారని వారు పేర్కొన్నారు. నీటి ట్యాంకర్ల సమ్మె కొనసాగితే హాస్టళ్లలో ఉంటున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్యాంకర్ల యజమానులతో చర్చించి... నగరంలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగకుండా, తక్కువ జనసాంద్రత కలిగిన ఫ్యూర్ ప్రాంతాల నుంచి నీటిని సేకరించి వ్యాపార కార్యకలాపాలు సాగించాలని ఎంతో దూర దృష్టితో హైడ్రా కమిషనర్ సూచించిన విషయాన్ని వాటర్ ట్యాంకర్ల యజమానులు దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ఈ సూచనతో ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించి నీటి సరఫరాలను పునరుద్ధరించేందుకు అంగీకరించడం హర్షణీయమని హాస్టళ్ల యజమానుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులకు నీటి సరఫరా సమస్య తలెత్తకుండా పరిష్కార మార్గం చూపినందుకు హైడ్రా కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేశ్ రెడ్డి

పూడూరు (జనంసాక్షి) : పూడూరు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఓపెనింగ్ కు పాల్గొన్న పూడూర్ గ్రామానికి చెందిన అశోక్ కుటుంబానికి నూతన గృహప్రవేశ వేడుకలో హాజరై కుటుంబ సభ్యులను కలసి నూతన గృహ ప్రవేశం చేసిన వారికి శుభాకాంక్షలు పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేశ్ రెడ్డి ఇలాంటి నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు ఇవ్వడం చాలా సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.



చౌడాపూర్ మండల కేంద్రంలో కిష్టంపల్లి గ్రామంలో మహిళా సంఘం (SHG) భవన నిర్మాణానికి భూమిపూజ గ్రామ సర్పంచ్ రాధిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం చంద్రశేఖర్

చౌడాపూర్ (జనంసాక్షి) :

సదర్ పండుగకు రాష్ట్ర గుర్తింపు

సీఎం రేవంత్‌రెడ్డికి అశోక్ యాదవ్ కృతజ్ఞతలు



రాజేంద్రనగర్,నవంబర్4(జనంసాక్షి) : యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నార్సింగి డివిజన్ అధ్యక్షుడు, నార్సింగి మల్లన్న స్వామి దేవాలయ నిర్మాణ, నిర్వహణ కర్త క్యాతం అశోక్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం హర్షణీయమని కొనియాడారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గ్రౌండ్ లో శ్రీకృష్ణ సదర్ సమ్మేళన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో నార్సింగి నుంచి హర్యానాకు చెందిన ప్రత్యేక ఆకర్షణతో రెండు దున్నపోతులను ప్రత్యేకంగా అలంకరించి పెద్ద సంఖ్యలో యాదవులతో కలిసి పాల్గొన్నారు. సదర్ పండుగ యాదవుల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌదరి పెద్దగొల్ల మధు యాదవ్, మాజీ ఎంపీటీసీ సాయిరాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు

శంషాబాద్,నవంబర్4(జనంసాక్షి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని శంషాబాద్ ఆర్జిఐఏ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 3న మొత్తం 18 కేసులను పరిష్కరించి రూ. 36,600 జరిమానా విధించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రాజేంద్రనగర్ 10వ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ఒక్కరోజు సాధారణ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమానా విధించారు.

రూ. 2 కోట్ల ప్రజాధనం వృధా కానివ్వం

నిరుపయోగంగా ఉన్న మిల్లు భవనానికి త్వరలోనే మోక్షం

అసంపూర్తి పనులు వేగవంతం చేసి పీఏసీఎస్ ఆదాయ వనరుగా మారుస్తాం

పాలకవర్గంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన యాలాల పీఏసీఎస్ నూతన చైర్మన్ బి.అనిల్ కుమార్

యాలాల నవంబర్ 4 (జనంసాక్షి) : ప్రభుత్వ నిధులు సుమారు రూ. 2 కోట్ల భారీ వ్యయంతో యాలాల మండలంలోని దౌలాపూర్ ప్రాంతంలో నిర్మించిన మిల్లు భవనం నిరుపయోగంగా పడి ఉండటం దురదృష్టకరమని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజాధనానికి సార్థకత చేకూరుస్తామని యాలాల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్ భీంశెట్టి అనిల్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నూతన పాలకవర్గ డైరెక్టర్లు మరియు సంఘం సిబ్బందితో కలిసి మిల్లు భవన సముదాయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి భౌతిక పరిస్థితులను, నిర్మాణ నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ భీంశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ, రైతాంగానికి అండగా నిలవాల్సిన సహకార సంఘం పరిధిలో ఇంత పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి నిర్మించిన భవనంలో, ప్రస్తుతం మిల్లుకు సంబంధించిన ఆధునిక యంత్రాలు లేకపోవడం వల్ల అది కేవలం ఒక ఖాళీ షెడ్డులా మిగిలిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడం వల్ల ఇటు రైతులకు సేవలు అందడం లేదని, అటు సహకార సంఘానికి ఎలాంటి లాభం చేకూరడం లేదన్నారు. విలువైన ప్రభుత్వ ఆస్తులు ఇలా



కాలయాపనకు గురైతే, చివరికి ఆ ఆర్థిక భారాన్ని, నష్టాన్ని మోయాల్సింది బ్యాంకు మరియు సహకార సంఘమేనని ఆయన విశ్లేషించారు. కేవలం నిధులు ఖర్చు చేసి భవనాలను నిర్మించి వదిలేయడం వల్ల ఎవరికి ప్రయోజనం ఉండదని, అందుబాటులో ఉన్న ఈ భారీ షెడ్డు సముదాయాన్ని సంఘానికి ప్రతి నెలా స్థిరమైన ఆదాయం తెచ్చిపెట్టే మార్గంగా ఎలా మార్చవచ్చో ఆలోచించాలన్నారు. మిల్లు ప్రారంభానికి అవసరమైన యంత్రాల ఏర్పాటు లేదా ప్రత్యామ్నాయంగా రైతు సంక్షేమ కార్యక్రమాలకు, గిడ్డంగుల అవసరాలకు ఈ స్థలాన్ని ఎలా లబ్ధి చేకూర్చే విధంగా మలచుకోవచ్చో నివేదిక ఇవ్వాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. గత పాలకవర్గాల హయాంలో నిర్మించిన ఈ విలువైన ఆస్తిని సంరక్షించుకుంటూ, పీఏసీఎస్ ఆర్థిక ప్రగతికి ఇది దోహదపడేలా నూతన పాలకవర్గ డైరెక్టర్లు, సిబ్బంది అందరూ ఒకే తాటిపైకి వచ్చి సమన్వయంతో తదుపరి చర్యలు వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.రైతుల ప్రయోజనాలే పరమావధిగా నూతన పాలకవర్గం పనిచేస్తుందని, త్వరలోనే ఈ మిల్లు షెడ్డుకు ఒక స్పష్టమైన రూపు తీసుకువచ్చి సంఘానికి నూతనోత్తేజం అందిస్తామని చైర్మన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పాలకవర్గ డైరెక్టర్లు, సహకార సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.